PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :194 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం 05.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# ఇంటర్ బోర్డు రద్దు!

## తెలంగాణలో స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు



### ఒకే గొడుగు కింద స్కూల్, ఇంటర్ విద్య..
### 1971, 1982 విద్యా చట్టాల స్థానంలో కొత్త చట్టం
### 2027–28 విద్యా సంవత్సరం నుంచి అమలుకు సర్కారు కసరత్తు

తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అతిపెద్ద నిర్మాణాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. దశాబ్దాలుగా విడివిడిగా కొనసాగుతున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం 1971, 1982 నాటి విద్యా చట్టాలను రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్న విలీన ముసాయిదా బిల్లుకు ఆమోదం లభిస్తే, 2027–28 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ కొనసాగనుంది.

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఏకీకృతం చేస్తూ 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)' పేరుతో ఒకే బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విలీన ముసాయిదా బిల్లు ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అన్ని ప్రక్రియలు పూర్తయితే 2027–28 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు పరిధిలోకి రానున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్య తెలంగాణ విద్యా చట్టం–1982, ఇంటర్మీడియట్ విద్య తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా చట్టం–1971 ప్రకారం కొనసాగుతోంది. ఈ రెండు చట్టాలను రద్దు చేసి, కొత్త చట్టం ద్వారా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాఠశాల, ఇంటర్ విద్యాశాఖలు సంయుక్తంగా ముసాయిదా బిల్లును సిద్ధం చేయగా, సిబ్బంది సర్వీసు నిబంధనలు, సీనియారిటీ తదితర అంశాల్లో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

### స్వయం ప్రతిపత్తిపై తుది నిర్ణయం

ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా సొంత నిధులతో పనిచేస్తుండగా, పదో తరగతి బోర్డు పూర్తిగా ప్రభుత్వ నిధులపై ఆధారపడి కొనసాగుతోంది. రెండు బోర్డులు విలీనమైన తర్వాత కొత్త బోర్డును స్వయం ప్రతిపత్తి సంస్థగా కొనసాగించాలా లేదా ప్రభుత్వ శాఖ పరిధిలోకి తీసుకురావాలా అనే అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

### స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలలు

విద్యా సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలోని 59 ప్రభుత్వ, 53 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (SBTET) నిర్వహిస్తున్న పరీక్షలు, సిలబస్ రూపకల్పన, పరిపాలనా బాధ్యతలను స్కిల్స్ యూనివర్సిటీకి బదిలీ చేయనున్నారు. న్యాయశాఖ ఆమోదం అనంతరం ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ముందుంచి, తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత 2027–28 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఒకే బోర్డు – ఒకే విద్యా పరిపాలనా వ్యవస్థ అమల్లోకి రానుంది.



## లోక్‌సభలో కొనసాగిన విపక్షాల ఆందోళన.. రెండు బిల్లులకు ఆమోదం

ఢిల్లీ, ప్రభాత సూర్యుడునీట్ పేపర్ లీకేజీ అంశం, రామాలయ విరాళాల చోరీ ఘటనలు లోక్‌సభను మంగళవారం కూడా స్తంభింపజేశాయి. సభ సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను కోరగా.. వారు ఏమాత్రం వెనక్కి



తగ్గలేదు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రప్రియేషన్ బిల్లు–2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. దీంతో వెంటనే సభలో చర్చకు రాగా.. విపక్ష సభ్యులు ఇరు బిల్లులనూ వ్యతిరేకిస్తూ గందరగోళం సృష్టించారు. కానీ.. చివరకు మూజువాణి ఓటుతో రెండు బిల్లులూ ఆమోదం పొందాయి. ఆ తర్వాత సభను రేపటికి వాయిదా వేశారు స్పీకర్. కాగా.. నేటితో పార్లమెంట్ సమావేశాలు 12వ రోజుకు చేరుకోగా.. సభ ప్రారంభంలోనే విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో సభాపతి సభను తొలుత మధ్యాహ్నం 12:00 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2:00 గంటలకు వాయిదా పడింది. అయితే.. ఈ సారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం జరగకపోవడం గమనార్హం.

## మెటాపై కేసు నమోదు చేసిన ఆ డీసీపీని.. రేవంత్‌రెడ్డి బదిలీ చేశారు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 4 ప్రభాత సూర్యుడుప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు.

**సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి..**

గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు.

**సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించాం..**

సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు,ఖాజ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు.



# హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూపు సమావేశం

## పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవడానికి, అక్రమ ఆస్తులను రికవరీ చేయడంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలి: కార్యదర్శి రచనా షా

హైదరాబాద్ ఆగష్టు 4 ప్రభాత సూర్యుడురెండు రోజుల పాటు నిర్వహించే బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ (ఏసీడబ్ల్యూజీ) సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 2026 ఆగస్టు 4, 5 తేదీల్లో ఈ సమావేశం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశం కూడా జరుగుతుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి కార్యదర్శి రచనా షా మాట్లాడారు.




సుస్థిరమైన, సమ్మిళితత్వంతో కూడిన అభివృద్ధికి... అవినీతి ప్రధాన ఆటంకంగా ఉందని ఆమె అన్నారు. ఇది ఆసుపత్రులు, పాఠశాలలు, కీలకమైన మౌలిక వసతుల నుంచి పరిమిత ప్రజా వనరులను మళ్లిస్తుందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీస్తుందని ఆమె తెలిపారు. అవినీతి అనే సవాలుకు ఏ దేశమూ మినహాయింపు కాదని, ఏ దేశమూ దీనిని ఒంటరిగా ఎదుర్కోలేదని ఆమె స్పష్టం చేశారు. అక్రమ ఆర్థిక మళ్లింపులను నివారించి, ప్రజా వనరులను పరిరక్షించడానికి, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సమష్టిగా, సమన్వయంతో కూడిన, నిరంతర అంతర్జాతీయ సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. సమగ్రత, జవాబుదారీతనం, అంతర్జాతీయ సహకారం, ఆవిష్కరణలను బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమైనదిగా మారిన ఈ సమయంలో బ్రిక్స్ ఏసీడబ్ల్యూజీ రెండో సమావేశం జరుగుతోందని కార్యదర్శి రచనా షా తెలిపారు. సీమాంతర అవినీతిని ఎదుర్కోవడంపై తన ఉమ్మడి బాధ్యతను బ్రిక్స్ ఆచరణాత్మక సహకారంగా, స్పష్టమైన ఫలితాలుగా మార్చాలని ఆమె అన్నారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల వల్ల ఎదురవుతున్న సవాళ్ల గురించి కార్యదర్శి ప్రస్తావించారు. నేరాల నుంచి లబ్ధి పొందే వారికి ఏ దేశమూ ఆశ్రయంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం వారి అప్పగింతకు సహకరించడడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, నేరస్తులు, అక్రమ నిధులు సరిహద్దులు దాటి తరలిపోవడానికి అవకాశం కల్పిస్తున్న లోపాలను తొలగించడంలో బలమైన సహకారానికి ఆమె పిలుపునిచ్చారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం కోసం ఏర్పాటు చేసిన అనధికారిక సహకార బ్రిక్స్ భాండాగారం విషయంలో సాధించిన పురోగతిని ఆమె స్వాగతించారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల విషయంలో, వారి అప్పగింతకు మద్దతు ఇవ్వడం కోసం బ్రిక్స్ దేశాల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్వర్క్‌పై జరుగుతున్న చర్చలను కూడా ఆమె స్వాగతించారు. నిర్దిష్టమైన ఫలితాల దిశగా కృషి చేయాలని సభ్యులను కోరారు. బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభించటాన్ని కార్యదర్శి రచనా షా స్వాగతించారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక టెంప్లేట్, స్థానిక నోడల్ పాయింట్లు, నిపుణుల డైరెక్టరీతో కలిసి చట్టాన్ని అమలు చేసే సంస్థల మధ్య వేగవంతమైన, మరింత ప్రత్యక్షమైన, అత్యంత ప్రభావవంతమైన సహకారాన్ని సులభతరం చేస్తాయని ఆమె పేర్కొన్నారు. నివారణాత్మక అప్రమత్తత, సాంకేతికత ఆధారిత పరిపాలనకు పెద్దపీట వేస్తూ మారుతున్న అవినీతి ముప్పులను ఎదుర్కొనే పరిష్కారంలో సాంకేతికతే కీలకమని కార్యదర్శి అన్నారు. డిజిటల్ గుర్తింపు, ఎలక్ట్రానిక్ సేవలందించే విధానం, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు వ్యవస్థలు వృథాను తగ్గించగలవని, అధికారుల విచక్షణాధికారాలకు కళ్లెం వేయగలవని, ప్రజా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయగలవని ఆమె పేర్కొన్నారు.




దేశ జాతీయ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ అయిన గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమాలను సాంకేతికత ఆధారిత సంస్కరణలకు ఉదాహరణలుగా ఆమె చెప్పారు. పన్నుల విధింపు, ఇతర ప్రభుత్వ ప్రక్రియల్లో ముఖ రహిత, కాగిత రహిత విధానాలు.. సాంకేతికతతో కూడిన నిఘా, డేటా ఆధారిత పర్యవేక్షణ, బలమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను కూడా ఆమె ప్రస్తావించారు. 'నవకల్పనలు, సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన' అంశంపై జరిగే సమాంతర కార్యక్రమం... విస్తరించదగిన విజిలెన్స్ పద్ధతులు, సాంకేతికత ఆధారిత పరిష్కారాలు, నివారణాత్మక పర్యవేక్షణా విధానాలపై సభ్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడానికి ఒక చక్కటి అవకాశాన్ని అందిస్తుందని కార్యదర్శి తెలిపారు.

# బాధితులకు పోలీస్ అండగా ఉంటూ సత్వర న్యాయం చేయాలి.

## కారేపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్.

సింగరేణి ఆగస్టు 04 ప్రభాత సూర్యుడు కారేపల్లి పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ కు నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. సర్కల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి పెట్టాలని, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ సాగర్, ఎస్సై గోపి పాల్గొన్నారు.





# విద్యార్థులకు బడి దుస్తులు అందేది ఎన్నడు.

### ఒక జతతోనైనా.. రెండవ జత వచ్చేనా. దుస్తులు అందించడంలో నిర్లక్ష్యమా? ఆలస్యమా.

సింగరేణి ఆగస్టు 4 ప్రభాత సూర్యుడు.సింగరేణి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్య సంవత్సరం 2026 ప్రారంభమై సుమారు మూడు నెలలు గడుస్తున్నప్పటికీ నేటికి విద్యార్థిని, విద్యార్థులకు రెండు జతల ఉచిత దుస్తుల పంపిణీ అందలేదు. విద్యార్థిని, విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ లో అధికారుల నిర్లక్ష్యమా? ఆలస్యమ అనే కోణంలో విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులు సందిగ్ధంలో ఉన్నారు. కొన్ని పాఠశాలలో మాత్రమే ఒక జత దుస్తులు అందజేసి రెండవ జత అందించలేదు. కొన్ని పాఠశాలలో ఒక్క జాత కూడా అందించలేదు. ఈ విద్యా విధానంలోనైనా విద్యార్థిని విద్యార్థులకు కొలతల ప్రకారం దుస్తులు పంపిణీ సజీవుగా సాగాలని తల్లిదండ్రులు అధికారులను కోరారు.కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం విద్యార్థులకు జావా పూర్తిస్థాయిలో అందడం లేదని, ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ప్రభుత్వ బడులో పూర్తిస్థాయిలో అమలు లేదని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే ప్రతి సంక్షేమ పథకాలను అమలు చేయాలని అధికారులను కోరారు.




# జైల్ భరో ను జయప్రదం చేయండి.

సింగరేణి ఆగస్టు 04 ప్రభాత సూర్యుడు కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో ను జయప్రదం చేయాలని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర పిలుపునిచ్చారు. కారేపల్లి పిహెచ్సి లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే విధంగా ప్రజా ఉద్యమాలు జరగాలని అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు, రైతులు,వ్యవసాయ కార్మికులు కు ఎంతో నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని అప్పుడే కార్మికుల హక్కులు కాపాడబడతాయని ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను కార్పోరేట్ల దోపిడీకి కార్మికులను గురి చేయడం దుర్మార్గమని ఇది ప్రజా ప్రభుత్వం కాదని భారత రాజ్యాంగాన్ని అనుసరించి పాలించే చట్టబద్ధ ప్రభుత్వం కాదని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేరు మార్చి 125 పని దినాలనే పేరుతో 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు అనే పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నదని దీనిలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ ఇతర పేదలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. రైతు నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులు నడ్డి విరిచి వారి పోరాటానికి బెదిరిపోయి క్షమాపణలు చెప్పి నల్ల చట్టాలు రద్దు చేస్తూ చెప్పిన కనీస మద్దతు ధర చట్టం ఇంతవరకు చేయలేదని ఇది రైతులను మోసం చేయడమేనని అది కాకుండా కొత్తగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రీఛార్జ్ రూపంలో నీరు వాడుకొని రైతులపై పన్ను భారాలు వేయడానికి విద్యుత్ చట్టాన్ని తెస్తున్నదని ఇది ముమ్మాటికి రైతు నల్ల చట్టాల అమలులో భాగమేనని,ఈ కారణంగా పేదలకు అందుతున్న ఉచిత విద్యుత్తు మృగ్యమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం విషయంలో న్యాయ పోరాటం చేస్తామనడం మరియు విద్యుత్ చట్టం అమలుకు కేంద్రంపై పోరాడకుండా కొత్త డిస్కములు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కేంద్ర ప్రభుత్వానికి సాగిలపడినని విమర్శించారు. ఈ సమస్యల వల్ల భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆ విధానాలను వెనుకకు తీసుకునే విధంగా ఆశా వర్కర్స్ కు 18 వేల ఫిక్స్ వేతనం ఇవ్వాలని, ఇతర పనులను చేయించవద్దని, పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్లతో జరిగే ఆగస్టు 10న జరగనున్న జైలు భరో కార్యక్రమంలో ఆశా లందరూ పాల్గొనాలని కే నరేంద్ర పిలుపునిచ్చారు.



# రూ.5 కోట్ల సుందరీకరణ పనుల్లో భారీ అక్రమాలు.. చెరువు వైశాలయాన్ని కుదించే కుట్ర!

## ఇన్‌ఫ్లో మార్గాలు బంద్.. సాగునీరు రాక ఆందోళనలో రైతన్నలు

## జేసీబీతో మత్తడి మార్గాన్ని తెరిచిన ఆయకట్టుదారులు








అశ్వారావుపేట ఆగస్టు 4 ప్రభాత సూర్యుడు)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని చారిత్రాత్మక దొంతకుంట చెరువు ఉనికి రోజురోజుకూ ప్రమాదంలో పడుతోంది. దశాబ్దాలుగా వందలాది ఎకరాల ఆయకట్టుకు జీవనాధారంగా నిలిచిన ఈ చెరువు, నేడు అధికారుల ఉదాసీనత మరియు కబ్జాదారుల కుమ్మక్కు రాజకీయం వల్ల తీవ్రంగా కుంచించుకుపోతోంది. చెరువు ఆక్రమణలపై ప్రజలు, రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు నామమాత్రపు సర్వేలతో కాలయాపన చేస్తూ కబ్జాదారులకు రక్షణ కవచంగా మారుతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**20 ఏళ్ల సరిహద్దులు గల్లంతు సుందరీకరణ వెనుక కుట్ర**

గత 20 సంవత్సరాల నుంచి చెరువుకు ఉన్న ప్రామాణిక కొలతలను, సరిహద్దులను పక్కనపెట్టి, ప్రస్తుతం రూ.5 కోట్ల భారీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి మరియు సుందరీకరణ పనుల పేరుతో చెరువు పరిధిని క్రమంగా తగ్గించి సరిహద్దులు గుర్తిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువును దాని అసలు వైశాల్యంలో కాపాడాల్సింది పోయి, ఆక్రమణకు గురైన భూములను కబ్జాదారుల పరం చేస్తూ చెరువు పరిమాణాన్ని కుదించేలా అధికారులు వ్యవహరించడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని మండిపడుతున్నారు. రూ.5 కోట్ల ప్రజాధనంతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులకు సంబంధించి కనీసం స్థానిక గ్రామ పంచాయతీలో ఎలాంటి తీర్మానం చేయకపోవడం, ఆయకట్టు రైతులతో కనీస సమావేశం కూడా నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులకు విన్నవించినా క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని, అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై ఆయకట్టుదారుల పొట్ట కొడుతున్నారని రైతన్నలు వాపోతున్నారు. 8 మీటర్ల వాకింగ్ ట్రాక్.. వర్షపు నీటి మార్గాల దిగ్బంధం!చెరువులోకి వర్షపు నీరు చేరే మూడు ప్రధాన కాలువలను (ఇన్ఫ్లో మార్గాలను) మూసివేస్తూ చెరువు చుట్టూ 8 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. దీనివల్ల వర్షాకాలంలోనూ చెరువులోకి చుక్క నీరు చేరే మార్గం లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కట్టపై అరకొరగా పోసిన మట్టి, రైతులు పొలంలో పోసి నష్ట చేస్తున్నారు, ఆ మట్టే వర్షాలకు జారి పక్కనే ఉన్న రైతుల పంట పొలాల్లోకి చేరుతుండటంతో వ్యవసాయ భూములు పాడువుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సహనం నశించి రంగంలోకి దిగిన రైతన్నలు!**

అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు సోమవారం జేసీబీ (జీజదీ) యంత్రంతో తమ సొంత ఖర్చులతో మూసివేసిన నీటి మార్గాన్ని తవ్వి చెరువులోకి నీరు ప్రవహించేలా చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో సాగు చేయడానికి నీరు లేకపోతే మేం ఎలా బతకాలి అని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. పాత రికార్డుల ప్రకారం సర్వే, దొంతకుంట చెరువు అసలు సరిహద్దులను గత 20 ఏళ్ల పాత రెవెన్యూ రికార్డుల ప్రకారం సమగ్రంగా కొలిచి సరిహద్దు రాళ్లు పాతాలి. ఆక్రమణలకు గురైన చెరువు భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని, కబ్జాదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి.



చెరువులోకి నీరు వచ్చే 3 ప్రధాన వర్షపు నీటి కాలువలను తక్షణమే తెరిపించి సాగునీరు అందేలా చూడాలి.

**ప్రత్యక్ష విచారణ,**

జిల్లా కలెక్టర్ గారు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రూ. 5 కోట్ల నిధుల వినియోగం మరియు చెరువు ఆక్రమణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి. మా చెరువు, మాకు కావాలి దొంతికుంటను ఆక్రమణదారుల నుండి రక్షించండి!ఇప్పటికైనా నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ మరియు జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి దొంతకుంట చెరువును, ఆయకట్టు రైతుల భవిష్యత్తును కాపాడాలని అశ్వారావుపేట ఆయకట్టు రైతుల మరియు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరి రామకృష్ణ, దుర్గాప్రసాద్, పద్మం ప్రసాదు, సూర్యనారాయణ, శ్రీను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# అసలు మున్సిపాలిటీలో పాలకవర్గం ఉందా లేదా?

### ఆ నలుగురు చెప్పిందే వేదం: బిజెపి పార్టీ



మధిర ఆగస్టు 4ప్రభాత సూర్యుడుమధిర భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగినటువంటి సమావేశంలో.భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీలో అయోమయం గందరగోళం అన్న రీతిలో పాలకవర్గం తీరుఅధికారం చేపట్టి ఆరు నెల్లలు అవుతున్న ఏమిచేయలేని స్థితిలో మున్సిపల్ పాలకవర్గం.మధిర మున్సిపాలిటీలో ఆ నలుగురు చెప్పిందే వేదంప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు వార్డులో సమస్యలు మాత్రం చెప్పితే చాలు అ నలుగురు పరిష్కరిస్తారంటజిల్లాలో ఏ మున్సిపాలిటీలో లేని అభివృద్ధి కమిటీ మధిర కు మాత్రమే ఎందుకుస్వచ్చంద సమస్థలు ప్రభుత్వం పాఠశాల విద్యార్ధులకు ఉదయం అల్పాహారం అందిస్తుంటే,పాఠశాల లో ప్రారంభాల పేరుతో కాంగ్రెస్ నాయకులు ఫోటోలకోసం ఉన్న శ్రద్ధ మధిర మున్సిపాలిటీలో అభివృద్ధి పై లేకపోవడం బాధాకరంమధిర మున్సిపాలిటీలో అభివృద్ధి కేవలం కాగితాలకు, మీడియాలో ప్రకటనలకే పరిమితంకనపడే అభివృద్ధి అంత గుంటల రోడ్లు తప్ప మరొకటి లేదుఇప్పటికైనా పాలకవర్గం మేల్కొని ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అభివృద్ధి పై ద్రుష్టి పెట్టండిలేకుంటే స్థానిక ప్రజలతో కలసి మున్సిపల్ ఆఫిసు ను సైతం ముట్టడించటానికి వెనుకడమని బీజేపీ పార్టీ తరుపున హెచ్చరిస్తున్నాంఅని అన్నారు ఈ కార్యక్రమంలో మధిర టౌన్ అధ్యక్షుడు శివరాజు సుమంత్, జిల్లా నాయకులు,పాపట్ల రమేష్, చిలువేరు సాంబశివరావు, మండల నాయకులు, మాదిరాజు సాయిరాం, బొడ్డు రామకృష్ణ, చక్రవర్తులు వరదరాజన్ పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్, ఆగస్టు 4 ప్రభాత సూర్యుడుపర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ భగాయత్ లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని పరిరక్షించడం కూడా అంతే అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి (ఐఏఎస్), జోనల్ కమిషనర్ రాధికా గుప్తా (ఐఏఎస్) పాల్గొని నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల మహా ధర్నా విజయంతం చేయాలి: ఎస్ఎఫ్ఐ

### షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్
### షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విజ్ఞాన్ డిగ్రీ విద్యార్థులతో సమావేశం



షాద్నగర్ ప్రభాత సూర్యుడు (ఆగస్టు 3) విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈనెల 6న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని మేరకు మంగళవారం షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది.శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై పోరాడేందుకు, దుకు ప్రభుత్వ విద్యను కాపాడుకు నేందుకు 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. విద్యార్థులందరూ ఐక్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం కార్యక్రమానికి షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించే ఈ పోరాటాన్ని జయప్రదం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. 6న జరిగే ధర్నా చౌక్ విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల కళాశాలల విద్యా ర్థులు భారీ సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాంచరణ్, తరుణ్,రాజేష్, శ్రీనేతన్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ క్లస్టర్ ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతమే లక్ష్యం

### జనగామ, నర్సంపేట మెడికల్ కాలేజీలు -- ఎంజీఎం ఆస్పత్రి -- వరంగల్ సూపర్ స్పెషాలిటీ పనులపై సమగ్ర సమీక్ష
### వరంగల్, జనగామ, హన్మకొండ జిల్లాల ఎమ్మెల్యేలతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమావేశం



ప్రభాత సూర్యుడు హైదరాబాద్। ఆగస్టు 4, 2026 హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వరంగల్, జనగామ, హన్మకొండ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవల విస్తరణ, ఆస్పత్రుల అభివృద్ధి, వైద్య విద్య బలోపేతం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌వోలు, వైద్య కళాశాలల అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.మంత్రి జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నర్సంపేట మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీ, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రి పనితీరును సమీక్షించారు. అలాగే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రుల అభివృద్ధి పనులు, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, మందుల సరఫరా, నిర్ధారణ పరీక్షలు, అత్యవసర వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు.ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని ఆస్పత్రుల అవసరాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ఆధునిక వైద్య సేవలు అందేలా మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తూ, ప్రజలకు వారి ప్రాంతాల్లోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉ ందన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, రోగులకు సత్వర సేవలందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌కు చెక్..

# ఇద్దరు లారీ డ్రైవర్లకు 5 రోజుల జైలు, రూ.10 వేల జరిమానా

ప్రభాత సూర్యుడు – సిద్దిపేట రోడ్డు ప్రమాదాల నివారణకు సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మద్యం మత్తులో లారీలు నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చెట్టుక్రింది ముత్యం రాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకుని, మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శ్రీ కాంతారావు న్యాయస్థానంలో హాజరుపరిచారు.విచారణ అనంతరం న్యాయమూర్తి ఇద్దరు డ్రైవర్లకు చెరో రూ.10,000 జరిమానాతో పాటు ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.శిక్షకు గురైన వారిలో కాసార్ల మల్లేశం, తోగుట గ్రామం, సిద్దిపేట జిల్లా, చుక్కల రవి,




పశ్చిమ గోదావరి జిల్లా, ఉన్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చెట్టుక్రింది ముత్యం రాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి చర్యల వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు ఇతర అమాయకుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు.అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వారిపై కూడా రూ.5 వేల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రోడ్డుపై గుంతల్లో వరి నాట్లు వేసి బీఆర్ఎస్ నేతల వినూత్న నిరసన

ప్రభాత సూర్యుడు – సిద్దిపేట ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించడం లేదని



సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు విమర్శించారు.సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో భారీమాం చౌరస్తా నుంచి ఎల్లమ్మ గుడి వరకు ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వర్షపు నీటితో నిండిపోవడంతో బీఆర్ఎస్ నాయకులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రోడ్డుపై నీరు నిలిచిన గుంతల్లో వరి నాట్లు వేసి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ మాట్లాడుతూ, ఎల్లమ్మ గుడి నుంచి భారీమాం చౌరస్తా వరకు ఉన్న రహదారి దయనీయ స్థితికి చేరుకుందని, ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులకు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. మరో వారం రోజుల్లోగా



మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు హెచ్చరించారు.

# స్టైపెండ్ పెంపు కోరుతూ ఆయుష్ వైద్య విద్యార్థుల సమ్మె






ఉప్పల్, ఆగస్టు 4 ప్రభాత సూర్యుడు:స్టైపెండ్ పెంపు కోరుతూ రామంతపూర్‌లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఎదుట తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్--పోస్ట్ గ్రాడ్యుయేట్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వం వెంటనే స్టైపెండ్ పెంచాలని విద్యార్థులు నినాదాలు చేశారు.తెలంగాణలో ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దేశంలోనే అత్యల్పమని, ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే సగం కంటే తక్కువగా ఉందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. 2016 వరకు అల్లోపతి, ఆయుష్ విద్యార్థులకు సమానంగా స్టైపెండ్ ఉండేదని, అనంతరం అల్లోపతి విద్యార్థుల స్టైపెండ్ పెరిగినా తమను విస్మరించారని ఆరోపించారు.అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైపెండ్‌ను తక్షణమే పెంచాలని, అప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతుందని జేఏసీ స్పష్టం చేసింది.

# వెంకట్‌రెడ్డి నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంపీ ఈటల చొరవ



ఉప్పల్, ఆగస్టు 4 ప్రభాత నహార్యుడు:మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్‌లో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చొరవ తీసుకున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు గడ్డం సాయి కిరణ్ తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఇంటర్నల్ డ్రైనేజీ అభివృద్ధి పనులను తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌కు వెంకట్‌రెడ్డి నగర్ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు గడ్డం సాయి కిరణ్ వెల్లడించారు.

# 6వ తేదీన ఉప్పల్ ఆలయాలకు బోనాల చెక్కుల పంపిణీ



ఉప్పల్, ఆగస్టు 4 ప్రభాత సూర్యుడు:ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 6న గురువారం ఉదయం 10:30 గంటలకు హబ్సిగూడ ఎన్‌జీఆర్‌ఐలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాల ఛైర్మన్లు, కమిటీ సభ్యులు, నిర్వాహకులు తప్పనిసరిగా హాజరై తమ ఆలయాలకు సంబంధించిన బోనాల చెక్కులను స్వీకరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.

# భూ భారతి పోర్టల్ పై అవగాహన ఉండాలి



ఆసిఫాబాద్ ఆగస్టు 04:ప్రభాత సూర్యుడు జూనియర్ అసిస్టెంట్లు భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశము పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కే హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్ పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డేవిడ్,తో కలిసి పాల్గొన్నారు.జూనియర్ అసిస్టెంట్లు కేవలం తహశీల్దార్ కార్యాలయం లోని ధరణి వంటి బాధ్యతలే కాకుండా, భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశము పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవలం భూ భారతి ఆపరేటర్ పై ఆధారపడకుండా, కార్యాలయ పనులలో పాటు భూ భారతి పోర్టల్‌లో నిర్వహించవలసి ఉందన్నారు. భూ సేకరణ అంశాలు, దరఖాస్తులు, ఇతర అంశాలు ఏ పనిని అప్పగించినా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశమును అవగాహన చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకూడదన్నారు.ఈ కార్యక్రమంలో భూ భారతి కోఆర్డినేటర్ రాము, రవికాంత్, జిలాని, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# రికార్డులే రికార్డులు: మ్యూజిక్ రైట్స్‌తో కోట్లు కొల్లగొడుతున్న భారీ ప్రాజెక్ట్‌లు!

భారతీయ చిత్ర పరిశ్రమలో సినిమాల డిజిటల్, శాటిలైట్ హక్కులతో పాటు ఆడియో (మ్యూజిక్) రైట్స్‌కు విపరీతమైన క్రేజ్ పెరుగుతోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో సినిమాల డిజిటల్, శాటిలైట్ హక్కులతో పాటు ఆడియో (మ్యూజిక్) రైట్స్‌కు విపరీతమైన క్రేజ్ పెరుగుతోంది. ఒకప్పుడు నామమాత్రపు ధరలకు అమ్ముడయ్యే మ్యూజిక్ ఆల్బమ్‌లు.. నేడు ఓటీటీలు, మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పోటీతో వందల కోట్ల బిజినెస్ సాధిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో భారీ బడ్జెట్ సినిమాలు తమ ఆడియో హక్కుల ద్వారా



నాన్-థియేట్రికల్ రెవెన్యూలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ.. చిత్ర నిర్మాణ వ్యయంలో పెద్ద మొత్తాన్ని విడుదలకు ముందే రాబడుతున్నాయి. ఈ క్రమంలో అత్యధిక ఆడియో హక్కుల ధరలు దక్కించుకున్న చిత్రాలలో టాప్ 10లో ఉన్న వాటి గురించి చర్చ సాగుతోంది. ఇటీవల రణబీర్ కపూర్ నటించిన -రామాయణం- ఫ్రాంఛైజీ ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ పౌరాణిక దృశ్యకావ్యం రెండు భాగాలకు కలిపి ఏకంగా రూ. 75 కోట్ల భారీ ధరకు ఆడియో హక్కులు అమ్ముడయ్యాయి. దీని తర్వాత ధురంధర్ 2 అత్యంత భారీ ధర దక్కించుకుని రెండవ స్థానాన్ని కైవసం చేసుకోగా.. తాజాగా బాలీవుడ్ సూపర్‌స్టార్ షారూఖ్ ఖాన్ నటిస్తున్న -కింగ్- చిత్రం ఈ జాబితాలో మూడవ స్థానంలో నిలిచింది.సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -కింగ్- సినిమా ఆడియో హక్కులను దక్కించుకోవడానికి సోనీ మ్యూజిక్, టీ-సిరీస్, సరేగమ వంటి దిగ్గజ సంస్థలు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఆఖరికి రూ. 50 కోట్ల రికార్డు ధరకు ఒక ప్రముఖ లేబుల్ ఈ ఆల్బమ్‌ను సొంతం చేసుకుంది. ఒకే ఒక్క భాగానికి (సింగిల్ ఫిల్మ్) గాను ఈ స్థాయిలో రూ. 50 కోట్లు పలకడం నాన్-థియేట్రికల్ బిజినెస్‌లో సరికొత్త సంచలనంగా నిలిచింది. సచిన్-జిగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం 2026 క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి రానుంది. కేవలం బాలీవుడ్ చిత్రాలే కాకుండా దక్షిణ భారత (సౌత్) సినిమాలు కూడా ఆడియో రైట్స్ బిజినెస్‌లో తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంటున్నాయి. ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లు ఆర్‌ఆర్‌ఆర్, బాహుబలి 2 చిత్రాలతో పాటు రాక్ స్టార్ అనిరుధ్ సంగీతం అందించిన రజనీకాంత్ -జైలర్-, దళపతి విజయ్ -గోట్-, జూనియర్ ఎన్టీఆర్ -దేవర- వంటి సౌత్ పాన్-ఇండియా చిత్రాలు రూ. 25 కోట్ల నుండి రూ. 35 కోట్ల రేంజ్‌లో ఆడియో హక్కుల ద్వారా సంచలన లాభాల్ని అందించాయి.

# రామాయణం రిలీజ్ కు ముందే మొదలైన కాక!

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -రామాయణం-. బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -రామాయణం-. ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి విమర్శలతో వివాదాల వలయంలో చిక్కుకుంటుంది. తాజాగా శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ సినిమా విడుదలకు ముందే తమకు ప్రత్యేకంగా ప్రదర్శించాలని డిమాండ్ చేయడం సంచలనంగా మారింది. శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ - పురాతన ఢిల్లీకి చెందిన లవ్ కుష్ రామ్‌లీలా అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ మేరకు చిత్రబృందానికి



అధికారికంగా లేఖ రాశారు. చిత్ర ట్రైలర్‌లో శ్రీరాముని పాత్రను చూపించిన తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ హుందాగా, ప్రశాంతంగా ఉండే శ్రీరాముని పాత్రలో ఎలాంటి భావోద్వేగాలు సరిగ్గా కనిపించలేదని పైగా శత్రువులను సంహరించేందుకు ఆగ్రహంతో ప్రతిజ్ఞ చేస్తున్నట్లు చూపించడం భారతీయ సాంప్రదాయ విలువులకు విరుద్ధంగా ఉందని ఆక్షేపించారు. గతంలో ప్రభాస్ నటించిన -ఆదిపురుష్- సినిమా సమయంలో ఎదురైన చేదు అనుభవాలను నిర్వాహకులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ సినిమాలో శ్రీలంకను బొగ్గుతో చేసిన నల్లని లంకగా చూపించడం, పాత్రల దుస్తులు మొఘల్ కాలపు శైలిలో లెదర్‌ను పోలి ఉండటం వంటి అంశాలు కోట్ల మంది హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని పేర్కొన్నారు. అంతటి భారీ బడ్జెట్ చిత్రం చివరకు బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైందని.. అలాంటి తప్పులు రామాయణంపై తీసే ఏ చిత్రంలోనూ పునరావృతం కాకూడదన్నారు. చిత్రంలో ఏ ఒక్క సన్నివేశం .. డైలాగ్ కూడా ప్రజల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతోనే ముందస్తు స్క్రీనింగ్ డిమాండ్ చేస్తున్నట్లు మహాసంఘ్ స్పష్టం చేసింది. రామాయణం వంటి గొప్ప ఇతిహాసం ఆధారంగా తెరకెక్కే చిత్రాలు వరుసగా పరాజయం పాలైతే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని.. అందుకే సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కాకముందే తాము పరిశీలించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ డిమాండ్‌పై నిర్మాతల పీఆర్ బృందం ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే మేకర్స్ కనుక ఈ ముందస్తు ప్రదర్శనకు అంగీకరించకపోతే? శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ ఇతర హిందూ సంఘాలతో కలిసి ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా సినిమా హాల్స్ ముందు పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో విడుదల తేదీకి ముందే ఇలాంటి వివాదాలు ..నిరసన హెచ్చరికలు ఎదురుకావడం చిత్ర యూనిట్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఒకవైపు వీఎఫ్‌ఎక్స్ పనుల కోసం .. వివాదాలకు తావు లేకుండా ఉండేందుకు మేకర్స్ అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ఈ తరహా డిమాండ్లు సినిమా వ్యాపార వాతావరణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో చిత్ర బృందం ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# తుంటి గాయంపై రష్మిక చికాకు.. గతంలో నభా కూడా!

నటి రశ్మిక మందన్న ఇటీవల ఒక చిత్రంలో డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా తీవ్రంగా గాయపడి.. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఆరు వారాల పాటు బెడ్ రెస్ట్ తీసుకుంటున్న విషయం తెలిసినదే. నటి రశ్మిక మందన్న ఇటీవల ఒక చిత్రంలో డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా తీవ్రంగా గాయపడి.. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఆరు వారాల పాటు బెడ్ రెస్ట్ తీసుకుంటున్న విషయం తెలిసినదే. ఈ కాలి గాయంపై సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) వేదికగా స్పందిస్తూ తన ఆవేదనను షేర్ చేసారు. రెగ్యులర్ గా ఇలా గాయపడటం తనకు తీవ్రమైన చిరాకు పుట్టిస్తుందని.. అసలు ఈ విషయం ఎవరికీ తెలియకూడదని భావించినా బయటకు వచ్చేసిందని తెలిపారు. తనకు ఇలాంటి గాయం కావడం ఇది మూడోసారి అని రశ్మిక ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో జిమ్ లో గాయపడినప్పుడు ఆ బాధతోనే సినిమా ప్రమోషన్లకు హాజరు కావాల్సి వచ్చింది. క్రేజీ క్రేజీగా.. తన గాయం తీవ్రత గురించి వివరిస్తూ.. తుంటికి కాలుని కలిపే టెండన్స్ ప్రతి వైపు నాలుగు ఉంటాయని అయితే ప్రమాదవశాత్తూ తన కుడి తుంటిలోని ఒక టెండన్ ఊడిపోయిందని రశ్మిక వెల్లడించారు. తాను కాలు పైకి ఎత్తాలన్నా... సాధారణంగా కదలాలన్నా ఆ టెండెన్ మళ్లీ సరిగ్గా అతుక్కోవాల్సి ఉందన్నారు. -మైసా- సినిమా కోసం డ్యాన్స్ షూటింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందని..తాను ఇప్పటివరకు అంగీకరించిన చిత్రాల్లో -మైసా- అత్యంత కష్టమైనదని చెప్పారు. అయితే నిరంతరం షూటింగ్స్‌తో బిజీగా ఉండే తనకు కాస్త విశ్రాంతిని ఇవ్వడానికే దేవుడు ఈ రూపంలో గాయాన్ని ప్రసాదించాడని పాజిటివ్‌గా భావిస్తున్నట్లు రశ్మిక చెప్పుకొచ్చారు.



ప్రస్తుతం రశ్మిక మందన్న -రణబాలి-, -మైసా- చిత్రాల చిత్రీకరణల్లో పాల్గొనడమే కాకుండా మరికొన్ని భారీ ప్రాజెక్టులలో నటిస్తున్నారు. అంతేకాకుండా సుమారు 30కి పైగా ప్రముఖ బ్రాండ్లకు అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. తుంటి గాయం కావడంతో సదరు చిత్రాల షూటింగ్స్‌తో పాటు, పలు ప్రకటనల చిత్రీకరణలు కూడా తాత్కాలికంగా నిలిచిపోయాయి. రశ్మిక త్వరగా కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు. ఇటీవల ఎందుకో ఇన్ని ప్రమాదాలు? ఇటీవలి కాలంలో సినీ పారిశ్రామిక వర్గాల్లో .. వేడుకలలో నటీనటులు బ్యాండేజీలు, కట్టులతో కనిపించడం సర్వసాధారణంగా మారింది. పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి అగ్ర కథానాయకులు షూటింగ్స్ - రిస్కీ యాక్షన్ సన్నివేశాలలో పాల్గొంటూ గాయపడి పలు వేడుకల్లో కట్టుతో కనిపించిన సందర్భాలు ఉన్నాయి. అదే బాటలో ఇటీవల నటి రశ్మికా మందన్న కూడా డ్యాన్స్ ప్రాక్టీస్‌లో తుంటికి తీవ్ర గాయం కావడంతో కొన్ని వారాల పాటు రెస్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో కథానాయిక నభా నటేష్ సైతం తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురై, సుదీర్ఘకాలం పాటు బెడ్ రెస్ట్‌కే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఆ సమయంలో శారీరక వేదనతో పాటు తీవ్రమైన మానసిక చికాకును ఎదుర్కొన్నానని.. అయితే ఆ ప్రతికూల పరిస్థితుల నుంచి పట్టుదలతో కోలుకుని తిరిగి వెండితెరపై గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చానని నభా పలు ఇంటర్వ్యూలలో తెలిపారు.

# 'ఇరుముడి' ట్రైలర్ డేట్ లాకయ్యిందా?




మాస్ మహారాజ రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే 'ఇరుముడి'. మంచి పాజిటివ్ హైప్ ని సెట్ చేసుకున్న ఈ చిత్రాన్ని దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ డ్రామా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ చిత్రం కోసం ఎదురు చూస్తున్న అభిమానులుకి వరుస అప్డేట్స్ లో భాగంగా వచ్చిన రెండో సాంగ్ ఆకట్టుకుంది. ఇక నెక్స్ట్ వచ్చే అప్డేట్స్ లో సాలిడ్ ట్రైలర్ కట్ కి సంబంధించి లేటెస్ట్ బజ్ వినిపిస్తుంది. దీని ప్రకారం ఇరుముడి ట్రైలర్ ఈ ఆగస్ట్ 16 లేదా 17న రానున్నట్టు తెలుస్తుంది. అదే సమయంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ ని కూడా చేయనున్నట్టుగా టాక్. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా ప్రియా భవాని శంకర్ రవితేజ సరసన హీరోయిన్ గా నటిస్తుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా గ్రాండ్ గా ఆగస్ట్ 21న విడుదల కాబోతుంది.

# మెగా 158.. ఆ రూమర్స్ లో నిజం లేదా!?




ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ లలో తన బ్లాక్ బస్టర్ దర్శకుడు వాల్తేరు వీరయ్య కాంబినేషన్ కొల్లి బాబీ కలయికలో చేస్తున్న సినిమా కూడా ఒకటి. చిరు కెరీర్ 158వ సినిమాగా దీన్ని కన్ఫర్మ్ చేసి గ్రాండ్ స్కేల్లో తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రస్తుతం షూట్ శరవేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ సినిమాపై ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ స్పెక్యులేట్ అవుతుంది.దీని ప్రకారం మెగాస్టార్ ఇందులో డ్యూయల్ రోల్ అది కూడా తండ్రీ కొడుకులు పాత్రలు చేస్తున్నారు అంటూ రూమర్స్ మొదలయ్యాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ట్రెండ్ లో కూడా మెగాస్టార్ ఈ తరహా రోల్స్ చేయడం లేదనే టాక్. సో ఇందులో నిజం లేదనే అనుకోవాలి. ఇక ఈ చిత్రంలో అనస్వర రంజన్ చిరు కూతురు పాత్రలో నటిస్తుంది. అలాగే థమన్ సంగీతం అందిస్తున్నాడు. కే వి ఎన్ సంస్థ నిర్మాణం వహిస్తున్నారు.

# తమిళ మార్కెట్లో తెలుగు యువనిర్మాత బిగ్ ప్లాన్స్

టాలీవుడ్ నిర్మాతలు ఇరుగు పొరుగు భాషల్లోకి దూసుకెళుతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ నిర్మాతలు ఇరుగు పొరుగు భాషల్లోకి దూసుకెళుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అల్లు అరవింద్, దిల్ రాజు లాంటి అగ్ర నిర్మాతలు బాలీవుడ్ లోను సినిమాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు యువ నిర్మాత నాగవంశీ తెలుగు సినిమాలతో పాటు తమిళ పరిశ్రమలోను బిజీగా మారారు. తాజాగా ద్విభాషా చిత్రం -విశ్వనాథన్ అండ్ సన్స్- ఆడియో లాంచ్ వేడుకలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత, నిర్మాత నాగవంశీ చేసిన వ్యాఖ్యలు దక్షిణాది సినీ వర్గాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కోయంబత్తూరులో జరిగిన ఈ వేడుకలో అతడు మాట్లాడుతూ.. తమ ప్రయాణం పళని పూజతో ఇక్కడే ప్రారంభమైందని .. కోయంబత్తూరు నగరం తమ బ్యానర్‌కు ఒక



లక్కీ ఛార్మ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళంలో తమకు ఇది రెండవ చిత్రమైనా స్థానిక ప్రేక్షకుల ఆదరణపై పూర్తి ధీమాను కనబరిచారు. తమిళ అగ్ర కథానాయకుడు సూర్య తమపై ఉంచిన నమ్మకాన్ని నాగవంశీ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. తెలుగు పరిశ్రమ నుంచి వచ్చిన యువ నిర్మాతలను నమ్మి... కథ విన్న మొదటి క్షణం నుంచే ఏమాత్రం సందేహపడకుండా ప్రాజెక్ట్ ఓకే చేసినందుకు సూర్యకి ధన్యవాదాలు తెలిపారు. -గజినీ- చిత్రంలో సూర్య చేసిన ఐకానిక్ క్యారెక్టర్ -సంజయ్ రామస్వామి- స్థాయి పాత్రను.. ఆయనలోని పూర్తి ఎనర్జీని ఈ చిత్రం ద్వారా అభిమానులకు మళ్లీ తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. సినిమా కంటెంట్, ముఖ్యమైన పాత్రల గురించి మాట్లాడూతూ నాగవంశీ కొన్ని ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న మమితా బైజు నటన -జెన్-జీ- యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే సీనియర్ నటి రాధిక సూర్య తల్లిగా అద్భుతంగా నటించారని.. ఫస్ట్ హాఫ్‌లో సూర్య, రాధిక, మమితల మధ్య వచ్చే ఒక ప్రత్యేకమైన కామెడీ సీన్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని చిన్న లీక్ ఇచ్చారు. తమ సినిమా అవుట్‌పుట్‌పై స్పందిస్తూ.. నాగవంశీ సినిమా విజయంపై పూర్తి ధీమాగా ఉన్నారు. తెలుగులో తమ బ్యానర్‌లో వచ్చిన ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ హిట్స్ తరహాలోనే ఈ చిత్రం కూడా తమిళ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సంగీత దర్శకుడికి జీవీకి సరదాగా మాస్ వార్నింగ్ ఇస్తూ.. సూర్య అభిమానులకు నచ్చేలా అత్యుత్తమ రీ-రికార్డింగ్ అందించాలని... హ్యాట్రిక్ హిట్‌ను అందించాల్సిన బాధ్యత మ్యూజిక్ డైరెక్టర్‌పై ఉందన్నారు.చివరగా సోషల్ మీడియాలో తనను -చింటూ- అని ఎందుకు పిలుస్తారో ఈవెంట్‌లో అడిగిన ప్రశ్నకు నాగవంశీ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తాను సోషల్ మీడియా వేదికగా కాస్త ఓపెన్‌గా - బోల్డ్‌గా స్పందిస్తుంటానని.. అందుకే అక్కడ అభిమానులు సరదాగా తనకు ఆ పేరు పెట్టారని క్లారిటీ ఇచ్చారు. వైవిధ్యమైన ప్రమోషన్లతో పాటు నిర్మాత నాగవంశీ చూపిన ఈ కాన్ఫిడెన్స్ చూస్తుంటే -విశ్వనాథన్ అండ్ సన్స్- సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555